క్లుప్తంగా

ట్రాఫిక్ అవస్థలు



మూడు గ్రామాల జంక్షన్లో నిలిచిన వాహనాలు

సారవకోట: మండలంలోని బుడితి, అవలింగి, చీడిపూడి గ్రామాల్లో నిత్యం ట్రాఫిక్‌తో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ మూడు గ్రామాల జంక్షన్లో రోడ్డు పైకి దుకాణాలు తీసుకురావడంతో పాటు, దుకాణాలకు వచ్చే సరుకుల లారీలు రోడ్డుకు ఆనుకుని నిలుపుదల చేస్తున్నారు. భారీ గ్రానైట్ వాహనాలు వస్తుండటంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడుతున్నారు. దీనిపై పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



వెంకటరామకృష్ణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు మీసాల వెంకటరామకృష్ణ తండ్రి, హిరమండలం–3 ఎంపీటీసీ సభ్యురాలు మీసాల రజిని మామ రామారావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. సుభలయలోని వెంకటరామకృష్ణ కుటుంబాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదివారం పరామర్శించారు. ఆ కుటుంబాలనికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.నీలి మోహన్‌రావు, జి.సురేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పీకర్ పర్యటన

పొందూరు: మండలంలో స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం పర్యటించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పప్పల రమేష్ ఆదివారం తెలిపారు. కేజీబీవీలో ఇంటర్మీడియెట్ విద్యార్థుల కోసం నిర్మించిన భవనాలను ప్రారంభిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

వైభవంగా చెవిటమ్మ తల్లి పండగలు



ఘటాలతో అమ్మవారి ఆలయానికి బయల్దేరిన గ్రామస్తులు

సారవకోట: మండలంలోని ధర్మలక్ష్మీపురంలో ఈ నెల 7 నుంచి అమ్మవారి పండగలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. 16వ తేదీ వరకు జరగనున్న ఈ పండగల్లో భాగంగా ఆదివారం చెవిటమ్మ తల్లి ఆలయానికి భక్తులు ఘటాలతో బయల్దేరారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం భారీ ఎత్తున ఘటాలతో గ్రామస్తులంతా బయల్దేరి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. అదే రోజు ఉత్సవాలు పూర్తిచేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పంట పండింది



మిరియాపల్లి వద్ద హైబ్రీడ్ పెసర పంటను నూర్పుడి చేస్తున్న రైతులు

ఎల్.ఎన్.పేట: ఈ ఏడాది రబీలో సాగు చేసిన హైబ్రీడ్ పెసర పంట పండింది. విత్తనం వేసినప్పటి నుంచి వాతావరణ పరిస్థితులు అనుకూలించటంతోపాటు వర్షాలు అనుకూలంగా కురిశాయని రైతులు చెబుతున్నారు. మండలంలోని వంశధార నదీ తీర గ్రామాలైన దబ్బపాడు, వాడవలస, మిరియాపల్లి, లక్ష్మీనర్సుపేట, బసవరాజుపేటతోపాటు స్కాట్‌పేట, మోదుగువలస, తురకపేట, ధనుకువాడ, కోవిలాం, పెద్దకోట తదితర గ్రామాల్లో హైబ్రీడ్ పెసర పంటను పండించారు. ప్రస్తుతం హైబ్రీడ్ పెసర కోతలు, నూర్పుడిలు చేస్తున్నారని ఏఓ పైడి లతశ్రీ తెలిపారు.

19 నుంచి క్రికెట్ టోర్నమెంట్

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 19వ తేదీ నుంచి టెన్నిస్ బాల్‌తో క్రికెట్ టెర్నమెంట్‌ను నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్నామని టోర్నీ నిర్వాహకులు సుగున్, రాకేష్ ఆదివారం తెలిపారు. కాకర్ల రవి జ్ఞాపకార్థం టోర్నీ నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల నుంచి టీములను ఆహ్వానిస్తున్నామన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతి అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న జట్లు ఫోన్ 63031 84421, 73969 63469 నంబర్లను సంప్రదించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

హనుమాన్ జయంతి ఉత్సవాలను ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గల్లోన్ని అన్ని గ్రామాల్లోనూ ఆదివారం ఘనంగా నిర్వహించారు. అభయాంజనేయ స్వామి ఆలయాల్లో వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అఖండ దీపారాధన, హోమాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

– సాక్షి నెట్‌వర్క్



సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామంలో స్వామివారి పూజల్లో పాల్గొన్న భక్తులు



ఆమదాలవలస రూరల్: అక్కులపేట జంక్షన్ వద్ద అన్నదానంలో పాల్గొన్న భక్తులు



పోలాకి: చింతాడపేటలోని రామయోగి సేవాశ్రమంలో మాట్లాడుతున్న ఆశామాతాజీ



నరసన్నపేట: నరసన్నపేటలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



బూర్జ: దొంకలపర్తలో అన్నసమారాధన నిర్వహిస్తున్న గ్రామస్తులు



పాతపట్నం: లోగిడిలో తమలపాకుల అలంకరణలో అభయాంజనేయ స్వామి



పొందూరు: పొందూరులో పూజలు చేస్తున్న భక్తులు



నరసన్నపేట: ముద్దాడపేటలో కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు, చిన్నారులు



హిరమండలం: హిరమండలం ప్రేమసాయి వృద్ధాశ్రమంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



సారవకోట: పద్మాపురంలో హనుమాన్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

గడపగడపలో సంతోషం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: ముఖ్యమంత్రిగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ.. మళ్లీ గెలవాలని ప్రజలు కోరుకుంటున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. కల్లెమ్మ పంచాయతీ పరిధి ఎస్‌ఎస్ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాలు సక్రమంగా అందుతున్నాయని కాలనీకి చెందిన లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించింది. ప్రభుత్వం సంక్షేమ పథకాల నుంచి లబ్ధిపొందిన వివరాలతో కూడిన కరపత్రాలను ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి అందజేశారు. అర్హత ఉండి పథకాలు అందని వ్యక్తులు ఉంటే గ్రామ వలంటీర్లను సంప్రదించాలన్నారు. కాలనీలో తాగు నీటి సమస్య ఉందని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమస్య పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కామక భాగవతి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు లోతుగెడ్డ తిరుపతిరావు, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, పార్టీ నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

258 మందికి వైద్య పరీక్షలు



నరసన్నపేట: తనిఖీలు చేస్తున్న వైద్య సిబ్బంది



బూర్జ: రోగులకు తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యులు

నరసన్నపేట: మండలంలోని చోడవరంలో అడపా మోహన్‌బాబు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య, కంటి శిబిరాల్లో 198 మందికి తనిఖీలు చేశారు. కిడ్నీతోపాటు ఇతర వ్యాధులపై చేపట్టిన తనిఖీలకు 130 మంది హాజరయ్యారు. 10 మంది కిడ్నీ రోగులకు రిఫర్ చేశారు. అలాగే కంటి చికిత్స శిబిరంలో 68 మందికి తనిఖీలు చేపట్టగా.. 33 మందికి కంటి ఆపరేషన్ల నిర్వహణకు ఎంపిక చేశారు. వీరికి చితంగా ఆపరేషన్లు చేసి, కళ్లద్దాలు పంపిణీ చేస్తామని ట్రస్టు ప్రతినిధి చంద్రశేఖర్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

జంగాలపాడు గిరిజన గ్రామంలో

బూర్జ: మండలంలోని టీడీఆర్ రాజుపేట పంచాయతీ పరిధి జంగాలపాడు గిరిజన గ్రామంలో సత్యసాయి సేవా సంస్థల ఆమదాలవలస జోన్ యూత్ ఆధ్వర్యంలో ఆమదాలవలకు చెందిన ప్రముఖ వైద్యులు పి. తాతయ్యులు, సుభాష్ చంద్రబోస్ హాజరై 60 మంది రోగులకు తనిఖీలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం రాష్ట్ర విద్యాజ్యోతి ఇన్‌చార్జి ఎస్.వి.గురుప్రసాద్, బూర్జ మండల ఎంపీపీ కర్నేన దీప మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందదాయకమన్నారు. మొక్కలు నాటడం, పారిశుద్ధ్య కార్యక్రమం, ఇంటింటా ప్రసాదం, అమృత కలశం, పౌష్టికాహారం, గొడుగులు, చెప్పులు, మజ్జిగ పంపిణీ, చలివేంద్రాల ఏర్పాటు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు ఎన్ని లింగరాజు, జిల్లా యూత్ కోఆర్డినేటర్ ఎ.శివకుమార్, జోనల్ యూత్ కన్వీనర్ ఎం.జనార్దనరావు, జోనల్ మాజీ కన్వీనర్ ఎం.రవీంద్రబాబు, జోనల్ మహిళా యూత్ ఇన్‌చార్జి ఎన్.జ్యోతి, జి.పవన్ తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో ఉత్సవాలు

పాతపట్నం: మండల కేంద్రంలో ఈ నెల 21 నుంచి 30 వరకు జరగనున్న నీలమణిదుర్గ ఉత్సవాలపై సీసీ కెమెరాల నిఘా ఉంటుందని సీఐ ఎం.వినోద్‌బాబు అన్నారు. ఆదివారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను ఉత్సవ హెడ్ కమిటీ సభ్యులు పరిశీలించారు. నగరంలోని ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును కమిటీ సభ్యులకు క్షుణ్ణంగా తెలియజేశారు. లక్షలాది మంది ఉత్సవాలకు రానున్న నేపథ్యంలో పోలీసుల నిఘాలో నగరం ఉంటుందని సీఐ తెలిపారు. ఎస్ఐ ఎన్.కామేశ్వరరావు, ఉత్సవ హెడ్ కమిటీ సభ్యులు లింగాల వెంకట మధు, కాళ్ల రాజు, కొండాల యరకయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



వరహాలక్ష్మి నరసింహ కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కొత్తూరు: మండలంలోని మహసింగి సమీపంలో ఉన్న వరహాలక్ష్మి నరసింహ ఆలయంలో ఆదివారం స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గోగులు వరప్రసాదరావు దంపతులతో పాటు పలువురు దంపతులు కల్యాణం జరిపించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. కొత్తూరు, మహసింగి, కల్లెమ్మ, మహసింగి కాలనీతో పాటు పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రహదారి పనులు వేగవంతం



మహేంద్రతనయలో రహదారి పనులు చేస్తున్న దృశ్యం

పాతపట్నం: మండలంలోని బూరగాం గ్రామ సమీపంలో గల మహేంద్ర తనయ నదీ మీదుగా పర్లాకిమిడికి బైపోర్స్ రహదారి మరమ్మతు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఆదివారం బూరగాం వద్ద రోడ్డు పనులు చేపట్టారు. ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు నీలమణి అమ్మవారి వారోత్సవాలు జరగనున్న నేపథ్యంలో పాతపట్నంలో ట్రాఫిక్ సమస్య లేకుండా బూరగాం మీదుగా పర్లాకిమిడి వైపు వాహనాలు మళ్లించడానికి పోలీసులు, అమ్మవారి హెడ్ కమిటీ సభ్యులు చర్యలు తీసుకుంటున్నారు.

నేడు జగనన్నకు చెబుదాంపై స్పెషల్ డ్రైవ్

హిరమండలం: జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మురళీమోహనరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. సంక్షేమ పథకాలు, సమస్యలపై ప్రభుత్వానికి విన్నవించేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా సోమవారం మండలంలోని కల్లట సచివాలయంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సబ్ కలెక్టర్ హాజరవుతారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

హిరమండలం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పీఈఎస్ పట్నాయక్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీలతో పాటు వృత్తివిద్యా కోర్సులకు సంబంధించి ఈఎస్ పట్నాయక్ తెలిపారు. మే 15 నుంచి జూన్ 14 వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. దరఖాస్తులు కళాశాలలో అందుబాటులో ఉంటాయని.. ఫారాలను నింపి ప్రిన్సిపాల్‌కు అందించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ట



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: మండలంలోని టెక్కలిపాడులో సీతారామ ఆలయ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ సమేత సీతారాముల విగ్రహాలను ప్రతిష్టించారు. నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దేవాలయాల నిర్మాణాల వల్ల ప్రజల్లో భక్తిభావం పెరుగుతుందన్నారు.

కన్న తల్లి ప్రత్యక్ష దైవం



ఆమదాలవలస: తల్లులను సత్కరిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: కన్న తల్లి ప్రత్యక్ష దైవమని అరుణోదయ సంస్థ ఫౌండర్ ఎం.కెరి ప్రాపోల్‌కుమార్ అన్నారు. స్థానిక అరుణోదయ రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ, హౌస్ ఆఫ్ ప్రేయర్‌లో మాతృ దినోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు అమ్మ గొప్పతనాన్ని వివరించారు. 15 మంది తల్లులను సత్కరించారు. పాస్టర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

తల్లి పాత్ర కీలకం

హిరమమండలం: మండలంలో మదర్స్ డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.ఎ్రమ్మ ఆధ్వర్యంలో పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాజంలో తల్లి పాత్ర కీలకమని.. కుటుంబంలో సైతం క్రియాశీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీనివాసరావు ఉన్నారు.

అమ్మవారి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, కమిటీ సభ్యులు

పాతపట్నం: పాతపట్నం గ్రామ దేవత నీలమణిదుర్గ అమ్మవారి ఉత్సవాలు ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ పనులకు రూ.53 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. బూరగాం నుంచి పర్లాకిమిడి రహదారి మరమ్మతులకు, రోడ్డు డైవర్స్‌కు పంచాయతీ రాజ్ శాఖ నుంచి రూ.13 లక్షలు, జె.జె.ఎం పనుల్లో భాగంగా రక్షిత మంచినీటి సరఫరాకు రూ.12 లక్షలతో లక్ష లీటర్ల వాటర్ ట్యాంక్ (సంప్) నిర్మాణం చేపట్టామన్నారు. ఉత్సవాలకు మౌలిక సదుపాయాల కోసం జిల్లా పరిషత్ నిధులు రూ.2 లక్షలు, ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేకంగా రూ.5 లక్షలను జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠ్కర్ మంజూరు చేశారన్నారు. మూడు మెడికల్ క్యాంప్‌లు, 15 బయో టాయిలెట్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఉత్సవ హెడ్ కమిటీ సభ్యుడు లింగాల రవికుమార్ మాట్లాడుతూ ఉత్సవాలకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రత్యే శ్రద్ధ తీసుకున్నారన్నారు. విద్యుత్, శానిటేషన్ మెరుగుకు కృషి చేసినందుకు చర్యలు తీసుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అమ్మవారి ఉత్సవాల పోస్టర్‌ను ఉత్సవ కమిటీ, అధికారులతో కలిపి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. విద్యుత్ శాఖ డీఈఈ ప్రసాద్, జేఈ రమేష్, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కల్యాణ్, డీటీ భీమారావు, ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా, ఆర్ఐ బాబీ, ఆలయ ఈఓ వాసుదేవరావు, నీలమణిదుర్గ అమ్మవారి చైర్మన్ నూలు ఈశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్‌సుందరావు, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు అర్జునరావు, తాతయ్య, సచివాలయ మండల కన్వీనర్ సూర్యం, ఉత్సవ కమిటీ సభ్యులు కాళ్ల రాజు, నూలు బుజ్జి, శిర్ల జోగారావు, మల్లికార్జునరావు, ఎస్.ప్రదీప్, ఎస్ మధుబాబు, భజింగరావు, షణ్ముఖరావు, శిర్ల ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



ఒకేచోట కలిసిన పూర్వ విద్యార్థులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2005–2008 సంవత్సరాల్లో డిగ్రీ చదివిన విద్యార్థులు ఒకేచోట కలిశారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి అధ్యాపకులను సత్కరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పూర్వవిద్యార్థి నెయ్యిల ధనుంజయ్‌కు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు తమ వంతు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.